సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 21 । జూన్ । 2024



ఘనంగా పంచామృతాభిషేకం
విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో త్రికాల పంచామృతాభిషేకం జరిపారు.
8లో



అప్పన్నకు ఆర్జిత సేవలు
సింహాచలం సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి.
8లో



నేటి నుంచి ఆరాధనోత్సవాలు
విశాఖ నగరంలోని అక్కయ్యపాలెం లలితా పీఠంలో శుక్రవారం నుంచి ఆరాధనోత్సవాలు జరగనున్నాయి.
8లో

వరదొచ్చినా.. నిరంతర సరఫరా

- చింతూరులో రూ.14 కోట్లతో 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్
- విలీన మండలాల్లో 33 కేవీ లైన్‌కు ఐదు సబ్ స్టేషన్ల అనుసంధానం
- లైన్లు ముంపునకు గురికాకుండా మరింత పొడవైన విద్యుత్ స్తంభాల ఏర్పాటు
- ముమ్మరంగా ముందస్తు చర్యలు
- గత ప్రభుత్వం రూపొందించిన ప్రణాళిక
- అమలు చేస్తున్న అధికార యంత్రాంగం

విలీన మండలాల్లో గోదావరి వరదలు సంభవించినప్పుడు విద్యుత్ లైన్లు ముంపునకు గురై రోజుల తరబడి సరఫరా నిలిచిపోతోంది. సమస్యను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక రూపొందించింది. దీనిలో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు రూ.14 కోట్లతో 220/132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుచేశారు. ముంపు సమస్యను అధిగమించేలా మరో రూ.60 లక్షలతో ప్రస్తుతం ఉన్న విద్యుత్ స్తంభాల స్థానంలో వాటికన్నా ఎత్తయినవి ఏర్పాటు చేస్తున్నారు.



గతేడాది గోదావరి వరదల్లో నీట మునిగిన విద్యుత్ లైన్లను పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు



గోదావరి వరదకు కూనవరం ప్రాంతంలో నీట మునిగిన విద్యుత్ లైన్లు (ఫైల్)



కూనవరం పోలీసుస్టేషన్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఎత్తయిన విద్యుత్ స్తంభం

కూనవరం: గోదావరి వరదలు సంభవిస్తే చింతూరు డివిజన్ పరిధిలోని విలీన మండలాల ప్రజల అవస్థలు వర్ణనాతీతం. విద్యుత్ లైన్లు ముంపునకు గురైతే నెలల తరబడి విద్యుత్ సరఫరా ఉండదు. మంచి నీటి పథకాలు పనిచేయక తాగునీటికి నానా అవస్థలు పడాల్సిందే. ఈ సమస్యను అధిగమించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికను విద్యుత్‌శాఖ అధికారులు అమలుచేస్తున్నారు. దీనిలో భాగంగా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా ముందస్తు పనులు మొదలు పెట్టారు.

నాలుగు మండలాల్లో..

గోదావరి వరదలు సంభవించినప్పుడు చింతూరు డివిజన్ పరిధిలో కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక, చింతూరు మండలాలపై ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. వీటి పరిధిలో ఐదు సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటికి నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా 33 కేవీ లైన్‌ను అనుసంధానం చేస్తున్నారు.

- చింతూరులో రూ.14 కోట్లతో ఏర్పాటుచేసిన 220/132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ విలీన మండలాల ప్రజలకు ఎంతో ఉపయోగం. వరద సమయంలో తెలంగాణ నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సందర్భంలో కూడా ముంపు ప్రభావం లేని గ్రామాలకు వెనువెంటనే సరఫరా ఇచ్చేందుకు ఈ సబ్‌స్టేషన్ ఉపయోగపడుతుందని విద్యుత్‌శాఖ అధికారవర్గాలు తెలిపాయి.
- చింతూరు డివిజన్‌లోని ఐదు సబ్‌స్టేషన్ల పరిధిలో 389 గ్రామాలు ఉన్నాయి. వీటిలో 245 గ్రామాలు లోతట్టున ఉన్నందున గోదావరి వరద ముంపు బారిన పడుతుంటాయి. అలాంటి గ్రామాల్లో సైతం విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా వాగుల వద్ద ఎత్తయిన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడం, కొద్దిపాటి వరదలకే ముంపుకు గురవుతున్న విద్యుత్ లైన్లను అవకాశం ఉన్నంత మేర మెరక ప్రదేశాలకు మార్చుతున్నారు.
- గతేడాది సంభవించిన వరదల సమయంలో విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ టీవీఎస్ఎన్ మూర్తి, చింతూరు డివిజన్ ఏడీఈ మలాకి, ఈఈ ఎండీ యూసఫ్ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను గుర్తించారు. ముంపునకు గురైన విద్యుత్ లైన్లను లైఫ్ జాకెట్లు ధరించి పడవపై వెళ్లి పరిశీలించారు. మార్పు చేయాల్సిన విద్యుత్‌లైన్లు, స్తంభాలను గుర్తించి ప్రణాళిక రూపొందించారు.
- ముంపు ప్రభావం ఉన్నచోట ఎత్తయిన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ లైన్లను మార్పు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఎనిమిది మీటర్ల ఎత్తయిన విద్యుత్ స్తంభాలు కొద్దిపాటి వరదలకే ముంపునకు గురవుతున్నాయి. ఆప్రాంతంలో విద్యుత్ లైన్లు ముంపు వల్ల 15 నుంచి 20 రోజుల వరకు బయట పడని సందర్భాలు ఉన్నాయి. ఈ పరిస్థితులను అధిగమించేందుకు అవసరాన్ని బట్టి 9.1, 11, 12.5 మీటర్ల పొడవైన విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే భద్రాచలంలో గోదావరి నీటి మట్టం 53 అడుగులకు చేరిన సందర్భంలో ముంపు మండలాల్లో మరో 10 అడుగుల ఎత్తులో విద్యుత్ లైన్లు ఉంటాయి. వరదలు తగ్గుముఖం పట్టిన వెంటనే సరఫరా పునరుద్ధరించవచ్చని విద్యుత్‌శాఖ అధికార వర్గాలు చెబుతున్నాయి.

వరదలను ఎదుర్కొనేందుకు ముందస్తు ఏర్పాట్లు



చింతూరు డివిజన్‌లో మారాయిగూడెం, లక్ష్మీపురం, చోడవరం, నెల్లిపాక, నందిగామ, మొద్దుమ్మారు, కూనవరం శబరిబ్రిడ్జి, పంద్రాజుపల్లి వాగు ప్రాంతాల్లో ఎత్తయిన విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేశాం. రానున్న వరదల ఎదుర్కొనేందుకు ముందస్తుగా మెటీరియల్, బోట్లు సిద్ధం చేశాం.ఒక్కో సబ్‌స్టేషన్ పరిధిలో 30 మంది ప్రైవేటు సిబ్బందిని అందుబాటులో ఉంచుతాం.
– మలాకి, డీఈ, విద్యుత్‌శాఖ, చింతూరు డివిజన్

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవలు

- కలెక్టర్ విజయసునీత
- ఘనంగా రెవెన్యూ దినోత్సవం
- రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం



రెవెన్యూ ఉద్యోగులను సన్మానిస్తున్న కలెక్టర్ విజయ సునీత

పాడేరు : రెవెన్యూశాఖపై ప్రజల్లో ఉన్న అపారమైన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిజాయితీగా సేవలందించాలని కలెక్టర్ విజయసునీత సూచించారు. గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రెవెన్యూ సిబ్బంది సేవలను కొనియాడారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పని తీరు అభినందనీయమన్నారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు 517 రకాల సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ శాఖ పాత్ర ఎంతో కీలకమన్నారు. మరిన్ని ఉత్తమ సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. జిల్లా రెవెన్యూ శాఖ అధికారి బి. పద్మావతి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో రెవెన్యూ శాఖ తల్లివంటిదన్నారు. పదవీ విరమణ చేసిన పలువురు రెవెన్యూ అధికారులను కలెక్టర్ విజయ సునీత సత్కరించారు. విధి నిర్వహణలో తమ అనుభావాలను పంచుకున్న రిటైర్డ్ ఎస్‌డీసీ టి. అప్పారావు, రిటైర్డ్ డీపీఎంవో జి. ఈశ్వర్,రిటైర్డ్ ఆర్ఐ శ్రీహరిరావులను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీలు శర్మ, భవాని, తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, కలెక్టరేట్ తహసీల్దార్ అరుణకుమారి, అప్పారావు, ఏవో సావిత్రి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ హెచ్చరిక
- గైర్హాజరైన గుంటసీమ హెచ్ఎంకు షోకాజ్ జారీ



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

దుంబ్రిగుడ (అరకులోయ టౌన్): ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని, విధులపట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ హెచ్చరించారు. గురువారం మండలంలోని గుంటసీమ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విధులకు గైర్హాజరైన హెచ్ఎం దురియా కోటేశ్వరరావుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. విద్యార్థులు పూర్తిస్థాయిలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. సికిల్ సెల్ అనిమియా పరీక్షలు చేయించుకునేలా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో ప్రతీ విద్యార్థి పాఠశాలకు వెళ్లి చదువుకునేలా కృషి చేయాలని వెల్ఫేర్ అసిస్టెంట్లకు సూచించారు. అనంతరం నందివలస బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. టెన్త్ విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీడీ కొండలరావు పాల్గొన్నారు.

108 వాహనంలో సుఖ ప్రసవం



శిశువును అప్పగిస్తున్న సిబ్బంది

అడ్డతీగల: నిండు గర్భిణిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ప్రసవించింది. గురువారం మండలంలోని రోళ్లగడ్డకు చెందిన గర్భిణి సీంద్రి గాసీకి నొప్పులు ఎక్కువయ్యాయి. వెంటనే ఆమెను బంధువులు 108 వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తీసుకువస్తుండగా మార్గం మధ్యలో మగబిడ్డను ప్రసవించింది. అక్కడి నుంచి తల్లీబిడ్డను తరలించి సీహెచ్‌సీలో చేర్పించారు. వారిద్దరు ఆరోగ్యంగానే ఉన్నట్టు సిబ్బంది తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



తనిఖీల్లో భాగంగా వాహనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సంతోష్ కుమార్

వై.రామవరం: మండల కేంద్రం నుంచి అడ్డతీగల వెళ్లే ప్రధాన రహదారిలో గురువారం ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు నిఘా ఏర్పాటుచేసి తనిఖీలు చేపట్టామని ఎస్ఐ తెలిపారు. డ్రైవింగు లైసెన్సులు, వాహన రికార్డులు సక్రమంగా లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు.

కిరండూల్ రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ దంతేవాడ-కమలూర్ సెక్షన్ మధ్య జరుగుతున్న రెండో లైన సంబంధిత ప్రి నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు విశాఖపట్నం-కిరండూల్(18514) ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకు కిరండూల్-విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. అలాగే ఈ నెల 26వ తేదీన విశాఖపట్నం-కిరండూల్(18514) ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 27వ తేదీన కిరండూల్-విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా జగదల్‌పూర్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్



బాలికలతో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు



రాజవొమ్మంగిలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

- విధులకు ఆలస్యంగా రావడంతో నోటీసుల జారీ
- జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు

కొయ్యూరు: విధులకు ఆలస్యంగా వచ్చిన నలుగురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గురువారం ఆయన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఆ సమయానికి పీడీ నారాయణమ్మ, సోషల్, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు గోవింద్‌నాయుడు, మల్లికార్జున్, లావణ్య హాజరు కాలేదు. దీంతో వారికి డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. స్థానిక ఎమ్మార్సీలో ఐఈఆర్‌టీ చాలాకాలంగా పనిచేయకపోయినా జీతాలు చెల్లించడాన్ని గుర్తించారు. వెంటనే జీతం నిలిపివేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పుస్తకాల పంపిణీ వివరాలను తెలుసుకున్నారు. కేజీబీవీని సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు.

స్కాట్ అమలుపై సూచనలు

స్కాట్ ఏర్పాటుపై రంపచోడవరం ఎమ్మార్సీలో నిర్వహించిన డివిజన్ స్థాయి హెచ్ఎంల సమావేశంలో స్కాట్ అండ్ గైడ్‌పై సమీక్షించారు. వెంటనే స్కాట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని హెచ్ఎంలను ఆదేశించినట్టు డీఈవో తెలిపారు. అనంతరం రంపచోడవరంలో పీడీలు, పీఈటీలతో నిర్వహించిన సమావేశంలో గ్రిగ్ పోటీలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇక్కడి ఉన్నత పాఠశాల హెచ్ఎం వీఆర్ఎస్ తీసుకోనున్న నేపథ్యంలో అతని స్థానంలో పీడీని నియమించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

సక్రమంగా పనిచేయకుంటే చర్యలు

రాజవొమ్మంగి: విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే చర్యలు తప్పవని డీఈవో బ్రహ్మాజీరావు ఉపాధ్యాయులను హెచ్చరించారు. ఆయన గురువారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు, జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. జడ్డంగి స్కూల్లో పిల్లల హాజరు, వారి పఠనా సామర్థ్యాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల పనితీరుపై నిత్యం ఆరా తీస్తున్నామన్నారు. విధుల్లో అలసత్వం సహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఇప్పటికే అరకు, కొయ్యూరు పాఠశాలల్లో విధులకు సకాలంలో హాజరుకాని ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. ఆయన వెంట హెచ్ఎంలు గోపాలకృష్ణ, రాజు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు ఉన్నారు.

మద్యం మత్తులో కొట్లాట

- మనువడి దాడిలో తాత మృతి
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన
- పోలీసులు కేసు నమోదు



వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు

పాడేరు : మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మినుములూరులో తాత, మనువడి మధ్య జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఈనెల 18న తాత దాగరి సూరిబాబు (60), మనువడు దాగరి నర్సింహమూర్తి కలిసి మద్యం సేవించారు. వారి మధ్య చోటుచేసుకున్న ఘర్షణ కాస్తా కొట్లాటకు దారి తీసింది. మనువడు దాడికి పాల్పడటంతో తాత సూరిబాబు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో మరుసటిరోజు సూరిబాబు అస్వస్థతకు గురవ్వడంతో కుటుంబ సభ్యులు కడుపు నొప్పి అని చెప్పి పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. కొద్ది సేపటికే అతను మృతి చెందాడు. ఆదేరోజు అతని మృతదేహాన్ని కుటుంబ సభ్యులు మనువడి ఇంటి వద్దకు తీసుకువెళ్లి నిలదీశారు. సూరిబాబు మృతికి నర్సింహమూర్తి కారణమని ధ్వజమెత్తారు. ఈ విషయం పోలీసులు దృష్టికి వెళ్లింది. వెంటనే రంగంలోకి దిగిన వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ కేసు దర్యాప్తులో ఉందని, పూర్తి వివరాలు తర్వాత వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం

ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి ఆదేశం



లబ్బర్తి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ పిల్లలతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

రాజవొమ్మంగి: చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి అన్నారు. గురువారం ఆమె మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల సందర్శించారు. ప్రీ స్కూల్ పిల్లల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించారు. సికెల్‌సెల్ అనీమియాపై పిల్లల తల్లులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవోలతో ఆమె సమావేశ మయ్యారు. కేంద్రాలకు అవసరమైన సరకులకు ప్రతినెలా ఐదో తేదీలోగా ఇండెంట్ ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 3,214 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 1,23,456 మంది లబ్ధిదారుల ఉన్నారన్నారు. వీరికి క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 5,200 మంది ఈ ఏడాది పూర్వ ప్రాథమిక విద్యను పూర్తిచేసుకోగా వీరికి సర్టిఫికెట్లు ఇచ్చి పాఠశాలలకు ప్రమోట్ చేశామన్నారు. జిల్లాలో మరో 456 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు అవసరమని ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. జిల్లాలో 1,668 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయన్నారు. రాజవొమ్మంగి ఇన్‌చార్జ్ సీడీపీవో అరుణలత ఆమె వెంట ఉన్నారు.

సెస్ బకాయిల వసూలుకు చర్యలు

- మూడు జిల్లాల జేసీలకు లేఖలు
- ఉమ్మడి విశాఖ గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకట్రావు



కొయ్యూరు గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కార్యదర్శి వెంకట్రావు

కొయ్యూరు: పేరుకుపోయిన సెస్ బకాయిలను వసూలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఉమ్మడి విశాఖ గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక గ్రంథాలయాన్ని సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రంథాలయ సెస్ బకాయిలు వసూలులో భాగంగా అనకాపల్లి, అల్లూరి, విశాఖ జిల్లాల జాయింట్ కలెక్టర్లకు లేఖలు ద్వారా నివేదించామన్నారు. కొయ్యూరు మండల పరిషత్ నుంచి రూ.4.64 లక్షలు వసూలు కావలసి ఉందని చెప్పారు. పాడేరు డివిజన్ 11 మండలాల్లో ఐదుగురు మాత్రమే గ్రంథాలయ అధికారులు ఉన్నారన్నారు. జనాభా ఐదు వేలు దాటిన ప్రాంతాల్లో నిబంధనల ప్రకారం గ్రంథాలయం ఏర్పాటుచేయాలన్నారు. అయితే దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసకోవలసి ఉందన్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ నెలాఖరుకు కొయ్యూరు గ్రంథాలయాధికారి కన్నబాబు పదవీ విరమణ చేయనున్నందున ఆయన బాధ్యతలను గొలుగొండ గ్రంథాలయాధికారి అప్పగిస్తున్నట్టు చెప్పారు.

ఇక సాఫీగా ప్రయాణం



విస్తరించిన మఠం-గన్నేరుపుట్టు రోడ్డు



కొత్తూరు సమీపంలో అభివృద్ధి చేసిన ఆర్అండ్‌బీ రోడ్డు

- చింతలవీధి జంక్షన్- మఠం కొత్తూరు రోడ్డు అభివృద్ధి
- 5.5 కిలోమీటర్లకు రూ.7 కోట్లు వెచ్చించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- 2019లో నిర్లక్ష్యంగా వదిలేసిన టీడీపీ పాలకులు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో అధ్వానంగా ఉన్న రహదారులను అభివృద్ధి చేసి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తనకంటూ ప్రత్యేకముద్రను వేసుకుంది. 2019లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన రోడ్లను సైతం అభివృద్ధి చేసింది. ఇందుకు ఉదాహరణగా జిల్లా కేంద్రం పాడేరుకు సమీపంలోని చింతల వీధి జంక్షన్ నుంచి మఠం కొత్తూరు వరకు నిర్మించిన డబుల్ రోడ్డును ఉదాహరణగా చెప్పవచ్చు. జిల్లా కేంద్రం పాడేరుకు సమీపంలోని చింతల వీధి జంక్షన్ నుంచి పెదబయలు వరకు 31 కిలోమీటర్ల మేర డబుల్‌రోడ్డు 2019లో మంజూరైంది. అప్పటిలో మఠం కొత్తూరు నుంచి పెదబయలు వరకు 25.5 కిలోమీటర్ల మేర మాత్రమే పనులు జరిగాయి. మిగతావి చేపట్టకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడేవారు. సమస్యను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మిగతా 5.5 కిలోమీటర్ల రోడ్డును 3.66 నుంచి ఏడు మీటర్ల వెడల్పున విస్తరించేందుకు రూ.7 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో పూర్తిస్థాయి నాణ్యత ప్రమాణాలతో చేపట్టిన నిర్మాణ పనులు పూర్తికావడంతో వాహనచోదకులకు అవస్థలు తప్పాయి. వారంతా గత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

హత్య కేసులో నిందితునికి యావజ్జీవం

విశాఖ లీగల్ : పంట పొలానికి నీరు తీసుకునే విషయంలో యువకుడిని హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవ జైలు, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ నగరంలోని నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.నాగేశ్వరరావు గురువారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా నెల రోజులు సాధారణ శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. అదనపు సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ బర్కత్ ఆలీ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు ఎంద్రపల్లి సంజీవరావు(42) ఉమ్మడి విశాఖ జిల్లా పాడేరు సర్కిల్ పరిధిలోని గిన్నెలు కోట పంచాయతీ పెదబయలు పోలీస్ స్టేషన్ పరిధిలోని లంగుడు గ్రామ నివాసి. మృతుడు లాసంగి గణపతి (27) కూడా లంగుడు గ్రామ నివాసి. వీరికి వ్యవసాయ భూములు ఉన్నాయి. పంట కోతకు వచ్చే సమయంలో ఇద్దరు పొలాలకు నీరు అవసరమైంది. ముందుగా గణపతి తన పొలానికి నీరు చాలా అవసరం అని చెప్పాడు. నిందితుడు అందుకు విరుద్ధంగా గణపతి పొలానికి నీరు ఇవ్వకుండా తన పొలానికి నీరు వాడుకున్నాడు. ఇదే అంశంపై ఇరువురు ఘర్షణ పడ్డారు. సంజీవ్ రావు, గణపతిపై కక్ష పెంచుకున్నాడు. గణపతిని హత్య చేయాలని పథకం వేశాడు. 2016 డిసెంబరు 20వ తేదీన లంగుడు గ్రామంలో ఉదయం 9 గంటల సమయంలో ఇద్దరు ఘర్షణ పడ్డారు. ఇదే అదునుగా సంజీవరావు తన వద్ద నున్న పదునైన సమకత్తితో గణపతి మెడపై నరికాడు. తీవ్ర గాయాలు, రక్తస్రావం మధ్య గణపతి అక్కడికక్కడే మృతి చెందాడు. 17వ తేదీ ఉదయం సంజీవరావు పోలీసులకు లొంగిపోయాడు. అప్పటి పాడేరు సీఐ కె.అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేసి నిందితులపై భారతీయ శిక్షాస్మృతి 302 కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు. గణపతి భార్య సూర్యామణి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

చెట్టు పైనుంచి జారిపడి గిరిజనుడికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన బాబూరావు

పాడేరు : నేరేడు పండ్లు సేకరిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు చెట్టు నుంచి జారిపడడంతో ఓ గిరిజనుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. మండలంలోని డి.గొందూరు పంచాయతీ కరకపుట్టు గ్రామానికి చెందిన సుర్రా బాబూరావు పట్టణంలోని మోదకొండమ్మ ఆలయంలో నైట్ వాచ్‌మేన్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం ఆలయంలోని పూజారి కుటుంబ సభ్యులు ఆలయ ప్రాంగణంలో ఉన్న నేరేడు చెట్టు ఎక్కి పళ్లను సేకరించాలని చెప్పారు. దీంతో బాబూరావు చెట్టెక్కి పండ్లను సేకరిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన అతడిని ఆలయ కమిటీ ప్రతినిధులు, ఆలయ అర్చకులు హుటాహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అతడికి మెరుగైన వైద్య చికిత్సల కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితాపీఠంలో ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు గురువుల ఆరాధనోత్సవాలు, ఆధ్యాత్మిక, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన కరపత్రాలను కుర్తాళం శంకరాచార్యులు శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ ఈనెల 21, 22, 23 తేదీల్లో సాయంత్రం 6 గంటలకు శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిచే త్రిశక్తి వైభవం ఉపన్యాసాలు జరుగుతాయని తెలిపారు. 24వ తేదీ సాయంత్రం శ్రీసిద్ధేశ్వరానంద భారతీ స్వామిచే జగద్గురు శంకర విజయంపై అనుగ్రహ భాషణం ఉంటుందన్నారు. 25వ తేదీన శ్రీలలితా సహస్రనామ పారాయణ, సువాసినీపూజ జరుగుతుందన్నారు. 26వ తేదీ సాయంత్రం మీగడ రామలింగస్వామి బృందంచే భక్త నత్కీర నాటక ప్రదర్శన, 27వ తేదీన డాక్టర్ డి.వి.సూర్యారావు ఆధ్వర్యంలో కవితాగోష్ఠి, 28వ తేదీన అక్కిరాజు సుందర రామకృష్ణ నిర్వహణలో భువన విజయం సాహితీ రూపకం ప్రదర్శన ఉంటుందని తెలిపారు. అలాగే 26వ తేదీ ఉదయం దక్షిణామూర్తి ఆరాధన, 28 తేదీన ఉదయం అవ్యక్తానంద మహరాజ్ ఆరాధన జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని పాల్గొన్నారు.

బడిబాటకు సై


చిన్నారులకు ప్రవేశాలు కల్పిస్తున్న ఉపాధ్యాయులు

- పకడ్బందీగా నేను బడికిపోతా
- జిల్లాలో నెల రోజుల పాటు నిర్వహణ
- ఉపాధ్యాయులు గ్రామబాట
- తల్లిదండ్రులతో సమావేశాలు
- డ్రాపౌట్‌లకు విద్యా వెలుగులు


ప్రవేశ దరఖాస్తులను పరిశీలిస్తున్న సిబ్బంది

సాక్షి,పాడేరు: ప్రభుత్వ పాఠశాలల్లో బడి ఈడు పిల్లలు, డ్రాపౌట్ బాలబాలికలను చేర్చి వారికి ప్రాథమిక విద్యను అందించే లక్ష్యంతో విద్యా శాఖ నేడు బడికి పోతా కార్యక్రమాన్ని ప్రారంభించింది. జిల్లాలోని 22 మండలాల్లో నెలరోజుల పాటు నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు విద్యాశాఖ తగిన ఏర్పాట్లలో నిమగ్నమైంది. కలెక్టర్ ఎం.విజయసునీత జిల్లాలోని అన్ని మండలాల ఎంఈవోలు, విద్యాశాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించడంతో పాటు జూలై 12వతేది వరకు నిర్వహించే రోజువారి నిర్వహించే కార్యక్రమాలపై తగిన ఆదేశాలిచ్చారు. డీఈవో బ్రహ్మజీరావు కూడా అన్ని మండలాలను సందర్శిస్తూ ఉపాధ్యాయులను సమాయత్తం చేస్తున్నారు. గ్రామాల్లో బడిబయట ఉన్న బాలబాలికలను గుర్తించిన వెంటనే తల్లిదండ్రులతో మాట్లాడి గ్రామ వలంటీర్ల సహాయంలో పాఠశాలల్లో చేర్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

జిల్లాలో కమిటీలు : నేను బడికిపోతా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా, మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లా కమిటీకి డీఈవో చైర్మన్‌గా, ఐటీడీఏ, సమగ్రశిక్ష అభియాన్, ఐసీడీఎస్, గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ డీడీలతో పాటు పలు శాఖల అధికారులు సభ్యులుగా వ్యవహరిస్తారు. మండల కమిటీకి ఎంఈవోలు, ఎంపీడీవో, తహసీల్దార్, ఐసీడీఎస్ సీడీపీవో, పలు విభాగాల సంక్షేమ అధికారులు, హెచ్ఎంలు, కేజీబీవీ ఎస్‌వోలు బాధ్యులుగా ఉంటారు .గ్రామ కమిటీల్లో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, పాఠశాల హెచ్ఎం, పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్, గ్రామ వలంటీర్, అంగన్‌వాడీ ఉద్యోగులను నియమించారు,.

జిల్లాలో పాఠశాలలు : జిల్లాలోని 22 మండలాల్లో అన్ని యాజమాన్యాలకు సంబంధించి 2972 పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి 10వతరగతి వరకు 1,73.897మంది విద్యార్థినీ, విద్యార్థులు చదువుతున్నారు.

ప్రతిష్టాత్మకంగా నేను బడికి పోతా అమలు



జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ నేను బడికిపోతా కార్యక్రమాన్ని నెల రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా అమలుజేస్తున్నాం. అన్ని పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు జిల్లా, మండల ,గ్రామస్థాయి కమిటీలన్నీ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించడం ఈనెల రోజుల లక్ష్యం. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అందరి కృషి అవసరం. ఎక్కడ నిర్లక్ష్యం నెలకొన్న సంబంధిత బాధ్యులపై చర్యలు తప్పవు.

– పి.బ్రహ్మజీరావు, డీఈవో, పాడేరు

హర్ ఘర్ జల్ పథకంపై అవగాహన


గెమ్మెలి గ్రామంలో హర్ ఘర్ జల్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జల్‌జీవన్ మిషన్ జిల్లా అధికారులు, సర్పంచ్ కొండబాబు తదితరులు

జి.మాడుగుల: హర్ ఘర్ జల్ పథకంలో మూడు గిరిజన గ్రామాల్లో సంపూర్ణ ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి సురక్షితమైన మంచినీటి అందించనున్నట్టు జల్‌జీవన్ మిషన్–ఎంపీఎంయు టీమ్ జిల్లా కో–ఆర్డినేటర్లు పి.వుల్లయ్య, ఐఈసీ జిల్లా కో–ఆర్డినేటర్ ఆనంద్, ఎంఐసీ జిల్లా కో–ఆర్డినేటర్ శివ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం గెమ్మెలి పంచాయతీలో గురువారం సంపంగిపుట్టు, తోకరాయి, గెమ్మెలి గిరిజన గ్రామాలను హర్ ఘర్ జల్ గ్రామాలుగా గుర్తించారు. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో సర్పంచ్ సీదరి కొండబాబు అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గెమ్మెలి గ్రామంలో 266 ఇళ్లకు రూ.7.5లక్షలతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సంపంగిపుట్టు గ్రామంలో 44 ఇళ్లకు రూ.7.5లక్షలు, తోకరాయి గ్రామంలో 62 ఇళ్లకు రూ.7.5లక్షలు మూడు గ్రామాల్లో ప్రతి ఇంటికీ ప్రభుత్వ భవనాలు, పాఠశాలలకు కలిపి రూ.22.5లక్షలతో 272 కుళాయిలు ఏర్పాటు చేసి గ్రౌండ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్‌ను నిర్మించినట్టు తెలిపారు. కుళాయిల నిర్వహణ బాధ్యత గ్రామస్తులు, వీడబ్ల్యూఎస్ కమిటీలపైనే ఉందన్నారు. గ్రామం నీరు, పారిశుధ్య కమిటీ ఆపరేషన్, నిర్వహణ చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామంలోని ప్రతి వ్యక్తికి రోజుకు 55లీటర్ల సురక్షితమైన శుద్ధిచేసిన నీటిని అందించాలని ఆయన సూచించారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంక్‌ను శుభ్రపరచటం, వాటర్ లీకేజీలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతి ఫిల్లింగ్‌లో వాటర్ క్లోరినేషన్ అయ్యేలా చూడాలని, నెలనెల సమావేశాలు నిర్వహించాలని వారు సూచించారు. నీటి పరీక్షలు కాలనుగుణంగా నిర్వహించాలని, కమ్యూనిటీ కంట్రిబ్యూషన్ యూజర్ చార్జీలు వసూలు చేయాలన్నారు. మొబైల్ యాప్‌లో హర్‌ఘర్ జల్ ధ్రువీకరణ పత్రం, సాంకేతిక పరమైన విషయాలను వారు తెలియజేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్ ఇచ్చిన ధ్రువీకరణ పత్రం ఆధారంగా గెమ్మెలి, సంపంగిపుట్టు, తోకరాయి గ్రామాలను హర్ ఘర్ జల్ గ్రామాలుగా సర్పంచ్ ప్రకటించారు. గ్రామ పెద్దలు హరి మురళినాయుడు, సత్యనారాయణనాయుడు, మచ్చమ్మ, గెమ్మెలి వసంత, పంచాయతీ కార్యదర్శి వీడబ్ల్యుఎస్సీ కమిటి సభ్యులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

అరకు ఎంపీ తనూజారాణికి అభినందనలు


అరకు ఎంపీ డాక్టర్ తనుజారాణి, చెట్టి వినయ్ దంపతులను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

పాడేరు : అరకు పార్లమెంట్ సభ్యురాలిగా వైఎస్సార్‌సీపీ తరఫున పోటి చేసి ఘన విజయం సాధించిన డాక్టర్ గుమ్మా తనుజారాణిను పాడేరు మండలంలోని పలు పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు గురువారం పాడేరులో ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ డాక్టర్ తనుజారాణి, ఆమె భర్త వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్‌లకు పుష్పగుచ్ఛాలు అందజేసి, దుశ్శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఓటమి పాలైందని ఏ ఒక్క కార్యకర్త కూడా అధైర్యపడవద్దని నిత్యం ప్రజలతో పాటు కార్యకర్తలకు తాము అండగా ఉంటామని ఎంపీ డాక్టర్ తనూజారాణి భ భరోసా ఇచ్చారు. ఎంపీను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, పాడేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు చిప్పాడ మీనా, తూపురు ఎర్రయమ్మ, దూసురు సన్యాసిరావు, లకే రామకృష్ణపాత్రుడు, సర్పంచ్‌లు సోమెలి లక్ష్మణరావు, పాంగి రాంబాబు, గెమ్మెలి అప్పలకొండ, జీలుగుబోయిన భీమలమ్మ, పాంగి ఆనంద్, మాజీ సర్పంచ్ కుంతూరు బొంజుబాబు, సీనియర్ నాయకులు తూపూరు గంగ తదితరులున్నారు.

20 కిలోల గంజాయి స్వాధీనం: ఎనిమిది మంది అరెస్ట్


గంజాయితో పట్టుబడిన నిందితులు


గంజాయి రవాణా,బైకల చోరీ నిందితులతో పోలీసు అధికారులు

కొయ్యూరు: చీడిపాలెం జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయి కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి 15 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ గురువారం రాత్రి తెలిపారు. ముగ్గురు వ్యక్తులు వస్తున్న ఆటోను తనిఖీ చేయగా 15 కిలోల గంజాయి బయడపడిందన్నారు. వారిని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ రామకృష్ణ చెప్పారు. గంజాయిని ఒడిశా ప్రాంతం నుంచి బూదరాళ్ల మీదుగా మైదాన ప్రాంతానికి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. పట్టుబడిన ముగ్గురులో ఇద్దరు ధారకొండకు చెందిన వారని, ఒకరు తమిళనాడుకు చెందిన వారని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

చోరీ బైక్‌లపై గంజాయి రవాణా

మోతుగూడెం: బైక్‌లు చోరీ చేయడంతో పాటు అవే బైక్‌లపై 5కిలోల గంజాయిని రవాణా చేస్తున్న ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్టు డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న చెక్‌పోస్టు వద్ద గురువారం వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడెం, కూనవరం ప్రాంతాల్లో ఇటీవల రెండు బైక్‌లు చోరీ చేసిన నిందితులు సీలేరులో రెండు రోజులు ఉండి, ఒడిశా రాష్ట్రం రాస్‌బేడాలో 5కిలోల గంజాయి కొనుగోలు చేశారని, అనంతరం సిలేరు నుంచి మణుగూరు బైక్‌లపై గంజాయి తరలిస్తుండగా నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. గంజాయి, బైక్‌లను సీజ్ చేశామని నిందితులు మండి వెంకటేష్, షేక్ షంసీద్, మెరుగ సాయికృష్ణ, కూకట్ల అఖిల్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితులలో మరోకరు మైనర్ కావడంతో రాజమండ్రి జువైనల్ కోర్టులో హాజరు పరిచామని ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్ (విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు


అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేసి, 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

- శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను కల్యాణ మండంలోని వేదికపై అధిష్టింపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

వ్యాన్ బోల్తా: ఎండీయూ వాహన ఆపరేటర్ మృతి


రహదారి పక్కనే తునాతునకలైన వ్యాన్



తీవ్రగాయాలతో మృతి చెందిన యాట్ల శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరెడ్డి (ఫైల్)

అడ్డతీగల: వెదురునగరం సమీపాన బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బియ్యం బండి (ఎండీయూ వాహనం) బోల్తాపడి వాహనం ఆపరేటర్ యాట్ల శ్రీనివాసరెడ్డి (40) మృతి చెందాడు. ఎస్‌ఐ లతాశ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. గంగవరం మండలం నూగుమామిడి గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి ఎండీయూ వాహనంలో అదే మండలంలోని జడ్డేరు, ఏటిపల్లి, మర్రిపాలెం రేషన్ డిపోల పరిధిలో నిత్యావసర సరకులను ఇస్తూ ఉంటాడు. వై.రామవరం మండలం చవిటిదిబ్బలులోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి అడ్డతీగల వైపు వస్తుండగా వెదురునగరం వద్ద వాహనం అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న తాటి చెట్టును ఢీకొట్టి పల్టీలు కొట్టింది. తీవ్రగాయాలతో కొన ఊపిరితో ఉన్న యాట్ల శ్రీనివాసరెడ్డిని గుర్తించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యానికి రాజమహేంద్రవరం తీసుకెళ్తుండగా కోరుకొండ ప్రాంతానికి వెళ్లేసరికి ప్రాణాలు విడిచాడని ఎస్‌ఐ చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దుశ్చర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చౌప్పలిలో ఆర్అండ్ఆర్ గ్రామసభ


మాట్లాడుతున్న తహసీల్దార్ సయ్యద్‌మౌలానా ఫాజిల్

వీఆర్ పురం: మండలంపరిధిలోని పోలవరం ముంపు గ్రామం చొప్పలిలో గురువారం తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ ఆధ్వర్యంలో ఆర్అండ్ఆర్ గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక నిర్వాసిత గ్రామస్తులకు పునరావాసం కల్పించే ఉద్దేశంతో అభిప్రాయ సేకరణ నిమిత్తం గ్రామసభ నిర్వహించినట్టు చెప్పారు. ఇందులో భాగంగా గ్రామంలోని మొత్తం గుర్తించి 196 నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయన్నారు. ఆయా నిర్వాసుతులకు ఎటపాక మండలం లింగాలపల్లి, రామగోపాలపురం గ్రామాల్లో, అలాగే గంగవరం మండలం లక్కొండ గ్రామాల్లో పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. కాగా ఆయా గ్రామాల్లో ఏఏ గ్రామాలను నిర్వాసితులు పునరావస నిమిత్తం కోరుకుంటున్నారనే విషయాన్ని సేకరించి, ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ ఫాజిల చెప్పారు. ఆర్ఐ ఎం.రామకృష్ణ, అర్అండ్ఆర్ కార్యాలయం , రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆనంద యోగం

ఆధునిక జీవనంలో అన్నీ ఉన్నా ఏదో ఒక టెన్షన్.. విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు అందరూ ఒత్తిడికి లోనవుతున్నవారే. పేదలకే కాదు ధనికులకూ సమస్యలే. అన్ని సౌఖ్యాలు ఉన్న వారు కూడా కొత్త కష్టాలను కొనితెచ్చుకుంటున్నారు. బయటకు రాలేక సతమతమవుతున్నారు. అనారోగ్యం బారిన పడుతున్నారు. జీవితాన్ని క్రమ పద్ధతిలో పెట్టుకోలేక అయోమయ స్థితిలో కొందరు ఇబ్బందులు పడుతున్నారు. ఆనాటి యోగులు, రుషుల కాలం నుంచి ఈనాటి నవీన సమాజం వరకు అందరికీ అన్ని వేళలా ఒకటే పరిష్కారం.. అదే యోగా!


ప్రత్యేక యోగాసనాలు

నక్కపల్లి: ఇంటిలోనూ, ఆఫీసులోనూ.. వృత్తి రీత్యా కొందరు, కుటుంబ సమస్యలతో మరికొందరు, అనారోగ్యాలతో ఇంకొందరు... ఒత్తిడికి గురవుతున్నారు. ఒత్తిడికి లొంగిపోయి, సమస్యలతో కుంగిపోయి చాలామంది క్షణికావేశంలో అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్నారు. విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. అటువంటి ఒత్తిడిని అధిగమించి, ప్రశాంత జీవనం గడిపేందుకు సనాతన భారతం ప్రపంచానికి చూపిన దివ్య ఔషధమే యోగా. ఒత్తిళ్లను అధిగమించడమే గాకుండా అనేక దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు, చక్కటి ఆరోగ్యానికి యోగసాధన ఎంతో ఉపకరిస్తుంది. అందుచేతనే ఇటీవల కాలంలో పల్లెల్లో సైతం యోగా శిక్షణకు ఆదరణ పెరుగుతోంది.

అనేకమంది మక్కువ కనబరుస్తున్నారు. యోగాసనాల్లో ముఖ్యంగా ఆకర్ణ ధనురాసనం, జాను శీర్షాసనం, పశ్చిమోత్తాసనం, ధనురాసనం, శలభాసనం, పవన ముక్తాసనం, నటరాజాసనం, వక్రాసనం, భుజంగాసనం, సర్వాసనం, పండూకాసనం ముఖ్యమైనవని చెప్పుకోవచ్చు.

యోగా శిక్షకుల సాయంతో..

రాష్ట్రాన్ని యోగాంధ్రగా చేసేందుకు ఆయుష్ శాఖ రెండేళ్ల కిందటే చర్యలు చేపట్టింది. ఆయుర్వేద ఆస్పత్రులున్న చోట పురుష, మహిళా యోగా శిక్షకులను రెండేళ్ల కిందట ఆయుష్ శాఖ గౌరవ వేతనంపై నియమించింది. వీరు పాఠశాలల్లో పిల్లలకు, గ్రామాల్లో పెద్దలకు యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామంపై శిక్షణ ఇస్తున్నారు. సుగర్, బీపీ సహా తలనొప్పి, వెన్నునొప్పి, మోకాళ్ల నొప్పి, నిద్రలేమి, శ్వాసకోశ, జీర్ణకోశ, ఉదర సంబంధిత వ్యాధుల నివారణకు యోగ సాధన ఒక వరంగా మారింది. పిల్లల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుదల, చక్కని ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపకరిస్తుంది. యోగా కేంద్రాలను ప్రభుత్వం ప్రోత్సహించాలని, కేవలం గౌరవ వేతనంపై యోగా శిక్షణ ఇస్తూ ఎంతోమందికి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్న యోగా ట్రైనర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.



ఆసనాలతో ఆరోగ్యమస్తు

విశాఖపట్నం : మనిషి అనంతమైన మేధాశక్తి, ఆత్మశక్తిల కలయికే యోగా.. యోగా అనేది వ్యాయామ పద్ధతి కాదు. మనిషి తను చేరుకోగల అత్యున్నత స్థితికి చేరవేసే సంపూర్ణ సాధన ప్రక్రియ. ఇది మనసును, శరీరాన్ని, ఆత్మను సమతుల్యంగా ఉంచడం ద్వారా మన జీవన శైలిని మెరుగుపరచడానికి దోహదపడుతుంది. యోగాను రోజువారీ జీవితంలో అమలు చేయడం ద్వారా వ్యక్తిగత ఆధ్యాత్మిక వికాసాన్ని పొందవచ్చు. ప్రపంచ దేశాలు యోగా వైపు చూస్తుండటంతో.. రోజురోజుకు యోగా కేంద్రాలు మారుమూల గ్రామాల్లో సైతం వెలుస్తున్నాయి. మానసిక ప్రశాంతతకు దూరమవుతున్న వారిలో ధైర్యం నింపి భవిష్యత్‌పై భరోసా కల్పిస్తున్నాయి. యోగా ఆరోగ్యంతో పాటు ఎందరికో ఉపాధి సైతం కల్పిస్తోంది. యోగా బోధకులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది. ఒత్తిడిని తగ్గించి ఆనందకర జీవనానికి తోడ్పడే సనాతన భారతీయ జీవన విధానంలో భాగమైన యోగా విశిష్టతను తెలియజేసేందుకు ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రతీ ఆసనం ఉప'యోగ'మే

ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా వివిధ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చని యోగా నిపుణులు పేర్కొంటున్నారు. యోగా వల్ల శారీరకంగా, మానసికంగా ధృఢంగా మారుతారు. శరీరంలో రక్త ప్రసరణ మెరుగవుతుంది. క్రమం తప్పకుండా యోగా చేస్తే మానసిక ప్రశాంతతో పాటు శ్వాసక్రియలో ఇబ్బందులు లేకుండా ఉంటుంది. యోగా చేయడం వల్ల శరీరంలో కొన్ని రకాల హార్మోన్లు విడుదలవుతాయి. ఈ కారణంగానే శరీరం విశ్రాంతి పొందుతుంది. వృద్ధాప్య ఛాయలు దూరమవుతాయి. నిద్రలేమి, కంటి సమస్యలు సహా వివిధ ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని నిపుణులు చెబుతున్నారు. కొవ్వు నిల్వలు సమతుల్యంగా ఉంటాయి. బరువు తగ్గాలనుకున్న వారికి యోగా అద్భుత ఔషధమని చెప్పొచ్చు. యోగాతో సామాజిక సంబంధాలు మెరుగుపడతాయి. కాగా.. యోగా ద్వారా ఎంతో మంది ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారు. యోగా స్టూడియోస్, సెంటర్ల ద్వారా ఉపాధి అవకాశాలు అందుతున్నాయి. టూరిజం, హాస్పిటాలిటీ రంగాల్లో కొత్త అవకాశాలు వస్తున్నాయి. విద్యార్థులకు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెంపొందించడానికి, వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేయడానికి ప్రముఖ విద్యా సంస్థలు సైతం యోగాన్నే ఆశ్రయిస్తున్నాయి. దీంతో విద్యా వ్యవస్థలో కూడా యోగా బోధకులకు డిమాండ్ ఏర్పడింది.